కథా నిలయం
5487
శ్రీకాకుళం



# వీరనారి

"మా ఆవిడ కొట్టింది" సిగ్గుపడుతూ చెప్పాడు గోపాలం.

ఎవరైనా భర్తతో తన్నులు తిని వైద్యానికొస్తే వాళ్ళ దెబ్బల్ని చూసి కోపం వచ్చి 'తిరగబడి మళ్ళీ తన్నలేవా అతన్ని?' అని ప్రశ్నిస్తుంది తను.

"ఈ పవిత్ర భారతదేశంలో పుట్టిన ఆడదానికి అన్ని దమ్ములున్నాయా? ఎంత వెర్రిదానివి?" అని తనను పరిహసిస్తున్నట్టు కన్నీళ్ళతో నవ్వేవారు కొందరు. చాలా ప్రమాదకరమైన వ్యక్తిని చూసినట్లు భయంగా చూసేవాళ్ళు కొందరు. అసలా ప్రశ్నే అర్థం కానట్లు చలనం లేకుండా వుండిపోయేవారు మరికొందరు. భర్తతో తన్నులు తినడమనేది వూపిరి పీల్చుకున్నంత సహజ విషయమయినట్లుగా, భార్యల్ని తన్నడం భర్తల జన్మహక్కన్నట్లుగా కొంతమంది ప్రవర్తించడం చూసి, "ఇలాంటి వాళ్ళకు విముక్తి లేదు. ఇలాంటి వాళ్ళను ఏ సంఘసంస్కర్తా చెయ్యి పట్టుకుని ముందుకు నడిపించలేడు" అని నిరాశపడిపోయేది తను. కొద్ది మంది రోషపడినా మాటలతోనే ఆగిపోయేవాళ్ళు. ఇన్నాళ్ళకు, ఇన్నేళ్ళకు యెవరోగాని ఈ వీరనారి చావచితక తన్నేసింది పళ్ళతో కండలూడొచ్చేలా కరిచింది. రక్తమొచ్చేలా గోళ్ళుగుచ్చి పీకేసింది. తన అసమ్మతిని - అసంతృప్తిని, తిరుగుబాటును యింత ఆవేశంగా ప్రకటించిన సాహసవంతురాల్ని ఒక్కసారి చూడాలనే కోరిక కలిగింది. కొంతమంది

ఆడవాళ్ళిలా రాక్షసంగా ప్రవర్తించే భర్తల అధికారాన్ని ఎదిరిస్తే కొన్ని వందలమంది మూగజీవుల్ని అది తప్పక కదిలిస్తుంది. కొన్ని వేలమంది మగవాళ్ళకది ఉలికిపాటు కలిగిస్తుంది. ఈ పరాభవం తమకూ జరుగుతుందనే జంకుతోనైనా వెనుకముందులాలోచించి మరీ భార్యమీద చెయ్యి చేసుకోకుండా వుంటారు. భార్యాభర్తలమధ్య ఉండవలసింది అధికారీ - బానిసా బాంధవ్యం కాదు. తిట్లూ, తన్నులూ కాదు. కోపం, ద్వేషం కాదని కొంతమంది నియంతలైన మగవాళ్ళైనా గుర్తిస్తారు.

"అబ్బా! అమ్మా!" గాయాల్ని శుభ్రంచేసి మందు రాస్తుంటే అతని అరుపులు విని శ్రుతిలోని స్త్రీ వెనక్కువెళ్ళి డాక్టరు ముందుకొచ్చింది.

"ఒక్క నిమిషం, మంట తగ్గిపోతుంది." అనునయంగా అతని వంక చూస్తూ మృదువుగా చెప్పింది శ్రుతి.

పాపం! ముందు కాకమ్మ కథలు చెప్పి తనను నమ్మించాలని చూశాడు. పెళ్ళాంతో తన్నులు తిన్నానని చెప్పుకోవడానికి సిగ్గుపడిపోయాడు మానవుడు. పళ్ళ గుర్తులు, గోళ్ళ గాట్లు చూసి తను లోతుగా ప్రశ్నించేసరికి తప్పక యింక అసలు విషయం బయట పెట్టాడు. ఇంతగా తిరగబడిందంటే ఆ ఇల్లాలు ఎన్నాళ్ళు కడుపులో మంటను భరించిందో! ఎన్నాళ్ళితని దౌష్ట్యాన్ని భరించిందో! ఎన్నాళ్ళుగా దాచుకున్న కసి నీవిధంగా వెలిబుచ్చిందో!!

"ఏం జరిగిందసలు? ఎందుకిలా అయింది?" అడగడానికి సంకోచపడుతూనే కుతూహలాన్నాపుకోలేకపోయింది శ్రుతి. ఆమె ప్రశ్నివిని లజ్జతో వంగిపోయిందతని తల. ఇంత అమాయకంగా, సాత్వికంగా వున్న ఇతను భార్యను హింసించగలడా?! తను పొరపాటు అభిప్రాయంతో మగజాతి అవలక్షణాన్ని, ఎవరో కొందరి దౌర్జన్య స్వభావాన్ని యితనికి అంటగట్టి ఏవేవో వూహిస్తూంది. భార్యాభర్తల మధ్య పొరపొచ్చాలకి సవాలక్ష కారణాలుంటాయి. అన్నిసార్లూ దుర్మార్గుడైన భర్తే కారణమవాలని రూలేం లేదు. శ్రుతి తనను తాను మందలించుకుంటూంది.

"ఏం జరిగుంటుందమ్మగారూ?! యిలాంటి నాలిముచ్చు మగాళ్ళ ఆగడాల్ని ఎన్నాళ్ళని ఓర్చుకుంటుందేఆడదైనా? ప్రాణం విసిగి ఎప్పుడో ఒకప్పుడిలా తిరగబడుతుంది" అంది పేషెంట్ ఒకామె. గోపాలం రక్తధారలతో లోపలికొచ్చే సరికి చూపించుకుంటున్న ఆమె ఒక పక్కన నిలబడి అతన్ని గమనిస్తూంది.

ఆమె మాటలు విని గోపాలం వెన్ను నిటారుగా అయింది. కళ్ళు రోషంతో జ్వలించాయి. అతని రియాక్షన్‌ని చూసి ఆమెను మందలించి బయటకు పంపింది శ్రుతి.

"మగాడు భార్యని కొడితే 'దుర్మార్గుడు', మంచిగా వుంటే 'చవట' అని తేలిగ్గా ముద్రలు

వేస్తారు. భార్యనుకొట్టే మగాళ్ళని నేనేం వెనకేసుకు రావడంలేదు. కాని అసలు చాలామంది మగాళ్ళలా ఎందుకు ప్రవర్తిస్తారో మీకు తెలుసా?... దెబ్బలకంటె ఎక్కువగా మాటల్తో హింసించే ఆడవాళ్ళు, తమ ఓర్పుతో, నేర్పుతో ఇంటిని ఆనంద నిలయంగా చెయ్యడం కాక రణరంగంలా మార్చి ప్రతిక్షణం సాధించేవాళ్ళు, భర్త తనకోసం ఎంత చేసినా సంతృప్తి లేకుండా యింకా ఏవేవో గొంతెమ్మ కోర్కెలతో ఇంట్లో అశాంతి సృష్టించే ఆడవాళ్ళు, సూటిపోటీ మాటల్తో, వ్యంగ్య బాణాల్తో ఎంతటి సహనవంతుడికీ పిచ్చెక్కించి, అతనిలోని మంచితనాన్ని చంపేసి, రాక్షసత్వాన్ని నిద్రలేపి, తన్నక తప్పని పరిస్థితి తీసుకొచ్చే ఆడవాళ్ళు..." ఆశ్చర్యంగా అతని ఆవేశాన్ని గమనిస్తూంది శ్రుతి.

"నామట్టుకు నేను నా భార్యనుంచి ఆశించినది చాలా స్వల్పమైన విషయాలు. నేను కష్టపడి సంపాదించి తెచ్చిన దాంతో ఒబ్బిడిగా సంసారాన్ని నడపాలనీ, పొదుపుగా వుంటూ పిల్లలకోసం కొంత వెనకేయాలనీ, నాకు, పిల్లలకు వేళకు అమరుస్తూ సజావుగా సంసారం నడచిపోయేలా చూడాలనీ, ఇందులో తప్పేమైనా వుందా చెప్పండి?" శ్రుతి అభిప్రాయం కోసం ఆగాడతను.

"తప్పేముంది?" చిన్నగా అంది శ్రుతి.

"అవునా? ఇవి ఏ సగటు మగాడైనా కోరుకునే కనీస కోరికలు. కాని నా భార్యెప్పుడూ ఆకాశంలో విహరిస్తూ వుంటుంది. సినిమాల్లోలా చెట్టాపట్టా లేసుకుని చెట్లూ, గుట్టలూ పట్టుకు తిరిగితే ఐదువేళ్ళూ నోట్లో కెళ్ళేదెలా? కుబేరుడి దత్తపుత్రికలా తెచ్చిన డబ్బు చీరలకీ, గాజులకీ, పౌడర్లకీ, పూసలకీ అవజేస్తుంటే యెన్నాళ్ళని ఓపిక పట్టను? చూశాను, చూశాను, ఓపిక వున్నంత వరకు నచ్చజెప్పాను. బ్రతిమాలాను. కోప్పడ్డాను. చివరికి విసిగిపోయి డబ్బు అందకుండా చేశాను. అప్పట్నుంచీ మొదలెట్టింది సాధింపు. ప్రతిదానికీ అలగడం, మొండి సమాధానాలు చెప్పడం, కక్షగా ప్రతిదీ యెతిమతంగా చెయ్యటం. ఈరోజు ఎంతో అలిసిపోయి, జ్వరంతో ఒళ్ళు నలగ్గొట్టినట్లుగా వుండి యింటికి వెళ్ళాను. పిల్లలు ఆకలితో ఏడుస్తున్నారు. ఇల్లు నానాభీభత్సంగా వుంది. వంటావార్పూ లేకుండా నా భార్య ముసుగుతన్ని పడుకునుంది. కోపంతో దహించుకు పోయాను! "మొండితనాని క్కూడా హద్దుండాలి. ఏమిటీ వేషం రోజూ?" అంటూ విసురుగా చెయ్యిపుచ్చుకు లేపాను. అంతే, సివంగిలా లేచి నామీద పడింది. చూశారుగా ఇవన్నీ మీరు?" గాయాలవంక చూసుకుంటూ చెప్తున్నాడతను. నోటమాటరాక, రెప్ప వెయ్యకుండా చూస్తూ వింటూంది శ్రుతి.